# రూ.41 కోట్లతో రాజాంలో అభివృద్ధి పనులు

**ఎమ్మెల్సీ కావలి ప్రతిభాభారతి**

**రాజాం, న్యూస్‌టుడే:**రాజాం నగరపంచాయతీలో రూ.41 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్సీ కావలి ప్రతిభాభారతి తెలిపారు. రాజాంలో మంగళవారం నిర్వహించిన 'జన్మభూమి- మాఊరు' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాజాం పట్టణం అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారించారని, ఇందులో భాగంగానే ఆయన అభివృద్ధి పనులకు స్వయంగా శంకుస్థాపన సైతం చేసినట్లు చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్నామని, ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. సామాజిక సమస్యలన్నీ ఇప్పటికే గుర్తించామని, వీటన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఏ ఒక్కరినీ విస్మరించే పరిస్థితి ఉండదని చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రతీ ఒక్కరూ సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఇందులో రాజాం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కావలి గ్రీష్మప్రసాద్, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## దశలవారీగా పరిష్కరిస్తాం

**రేగిడి, న్యూస్‌టుడే** : మండల పరిధిలోని 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమంలో వచ్చిన అర్జీలను దశలవారీగా పరిష్కరించనున్నట్లు ఎంపీపీ కిమిడి వేణిసుందరం తెలిపారు. మంగళవారం రేగిడిలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రామకృష్ణంనాయుడు, ప్రత్యేకాధికారి రహీం, ఎంపీడీవో శంకరరావు అధికారులు పాల్గొన్నారు.

**నీలయ్యవలస(వంగర),న్యూస్‌టుడే** : సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికే 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ సభ్యులు బొత్స వాసుదేవరావునాయుడు అన్నారు. మంగళవారం మండల పరిధి నీలయ్యవలస, బాగెంపేట, పటువర్ధనం గ్రామాల్లో ప్రత్యేక అధికారి సీహెచ్ అప్పలస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రుషింగి సర్పంచి యలకల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

- పటువర్ధనంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదని ఎంపీడీవో డి.వి.రామారావు, తహసీల్దార్ పి.అప్పారావు గ్రామస్థులను ప్రశ్నించారు.
- బాగెంపేటలో పింఛన్లు, ఇతర పథకాల వర్తింపులో పక్షపాతం వహిస్తున్నారని ప్రశ్నించారు.

## సంతకవిటిలో..

సంతకవిటి గ్రామీణం,**న్యూస్‌టుడే:**గ్రామాల్లో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామనితెదేపా సీనియర్ నాయకులు కొల్ల అప్పలనాయుడు అన్నారు. మంగళవారం మండాకురిటి, మామిడిపల్లి, సురవరం, పుల్లిట గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్కుల పంపిణీతోపాటు కొత్త రేషన్‌కార్డులు, గ్యాస్ పొయ్యిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కృష్ణారావు, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో వేణుగోపాలనాయుడు, సర్పంచులు గంటా అనురాధ, కొల్ల రేవతి, ఏపీఎం సీతారాం పాల్గొన్నారు.

## అధికారులను నిలదీసిన లబ్ధిదారులు

మండాకురిటి జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, పింఛన్లు, అందకపోవడంపై లబ్ధిదారులు అధికారులను ప్రశ్నించారు.గ్రామంలో సీసీ రహదారుల నిర్మాణం చేపట్టాలని పలువురు కోరారు.